క్లుప్తంగా

అంగన్‌వాడీ కిచెన్ గార్డెన్ పరిశీలన



ముసుళ్లగుంటలో కిచెన్ గార్డెన్‌ను పరిశీలిస్తున్న సీడీపీఓ నాగలక్ష్మి

నల్లజర్ల: మండలంలోని ముసుళ్లగుంట అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో నిర్వహిస్తున్న కిచెన్ గార్డెన్‌ను శనివారం గోపాలపురం ఐసీడీఎస్ సీడీపీఓ నాగలక్ష్మి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రసాయన ఎరువులు, పురుగుమందులు వాడని ఆకుకూరలు, కాయగూరలను అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ఏర్పాటు చేసిన కిచెన్ గార్డెన్‌లలో పండిస్తున్నామన్నారు. అనంతరం సర్పంచ్ నందమూరి శారదాదేవి ఆధ్వర్యంలో బాలింతలు, గర్భిణులకు ఆకుకూరలు అందజేశారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ పద్మావతి, సూపర్‌వైజర్లు వెంకటలక్ష్మి, ఎం.హారతి, ఎస్వీ కృష్ణవేణి పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల సంఘ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి దుర్గేష్ తదితరులు

నిడదవోలు: గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం (డెమోక్రటిక్ అసోసియేషన్) 2025వ వార్షిక క్యాలెండర్‌ను శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మంత్రి కందుల దుర్గేష్, మునిసిపల్ కమిషనర్ టి.కృష్ణవేణి చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ఖజానా అధికారి టి.దుర్గాప్రసాద్, జిల్లా అధ్యక్షుడు ఎస్.సుబ్బారావు, నిడదవోలు మునిసిపల్ సంఘం అధ్యక్షుడు రాజేష్, ప్రధాన కార్యదర్శి ఈ.రియాజ్, జిల్లా జాయింట్ సెక్రటరీ ఒ.కృష్ణ, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీ ప్రారంభం

చాగల్లు: ఎన్టీఆర్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ శనివారం చాగల్లులో ప్రారంభమైంది. పంచదార రమేష్, దొంగ దుర్గాప్రసాద్, చెరుకూరి సీతారాం ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో ఈ టోర్నమెంట్ నిర్వహిస్తున్నారు. ఈ పోటీలను టీడీపీ నాయకురాలు, నెలటూరు సర్పంచ్ యడ్లపల్లి ఉమారజని, కోడూరు ప్రసాద్, యడ్లపల్లి రకారావు ప్రారంభించారు. ఈ పోటీలు జనవరి 8 వరకూ జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.

పారా లీగల్ వలంటీర్లకు శిక్షణ

కొవ్వూరు: సామాన్యుల న్యాయపరమైన సమస్యల పరిష్కారానికే పారా లీగల్ వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేశామని జిల్లా తొమ్మిదో అదనపు జడ్జి ఎం.అనురాధ పేర్కొన్నారు. పారా లీగల్ వలంటీర్లకు శనివారం పట్టణంలో కోర్టు హాలులో శిక్షణ తరగతులు నిర్వహించారు. న్యాయ సమస్యల పరిష్కారంలో న్యాయవ్యవస్థకు, ప్రజలకు మధ్య వలంటీర్లు వారధిగా పని చేయాలని ఆమె సూచించారు. సీనియర్ సివిల్ జడ్జి జీవీఎల్ సరస్వతి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జి.సాయికృష్ణ, ఒకటో తరగతి మేజిస్ట్రేట్ బీటీఎస్ దేవి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారికి వైభవంగా తిరుప్పావడ సేవ

దేవరపల్లి: ధనుర్మాసం సందర్భంగా స్థానిక శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి వారికి అర్చకులు శనివారం తిరుప్పావడ సేవ నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో సేవలో పాల్గొని ప్రసాదాలు స్వీకరించారు. జనవరి 13 వరకూ ధనుర్మాస మహోత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ అంబటి శ్రీనివాసరావు తెలిపారు.

సచివాలయాల్లో ఎస్సీ జాబితాలు

చాగల్లు: మండలంలోని అన్ని గ్రామాల్లోని ఎస్సీ కులాల జాబితాను ఆయా గ్రామ సచివాలయాల వద్ద అందుబాటులో ఉంచినట్టు ఎంపీడీవో ఆర్. శ్రీదేవి తెలిపారు. ఎస్సీలు ఆ జాబితాలను పరిశీలించుకుని ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 31లోగా సచివాలయం ద్వారా దరఖాస్తు చేసుకొని సరి చేయించుకోవాలని ఆమె తెలిపారు.

అధిక కట్నం వేధింపులపై కేసు

కొవ్వూరు: అధిక కట్నం వేధింపులపై కాకినాడకు చెందిన వీరబాబుపై కొవ్వూరు పట్టణ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. హెడ్‌కానిస్టేబుల్ ఆర్.సాంబమూర్తి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణానికి చెందిన చోడిపల్లి శారదకు వీరబాబుతో 2008లో వివాహమైంది. ఈ దంపతులకు ఇద్దరు పిల్లలున్నారు. ఇటీవల అధిక కట్నం తీసుకు రావాలంటూ వీరబాబు భార్యను వేధించగా పెద్దల సమక్షంలో సర్దుబాబు చేశారు. ఈ నేపథ్యంలో వారి కాపురాన్ని కాకినాడ నుంచి కొవ్వూరుకు మార్చారు. అయినప్పటికీ వీరబాబు తీరు మారకపోవడంతో భార్య శారద పట్టణ పోలీసులకు భర్తపై ఫిర్యాదు చేసింది. దీనిపై శనివారం కేసు నమోదు చేసినట్టు హెడ్ కానిస్టేబుల్ సాంబమూర్తి తెలిపారు.

కాలువ గట్లా .. డంపింగ్ యార్డులా?

- వ్యర్థాలను డంపింగ్ చేస్తున్న పంచాయతీలు
- కలుషితం అవుతున్న నీరు
- అనారోగ్యం పాలవుతున్న ప్రజలు



తీపర్రు వద్ద కాకరపర్రు కాలువ గట్టుపై వేసిన వ్యర్థాలు




ఖండవల్లి వద్ద కాలువను చెత్తచెదారంతో పూడ్చివేస్తున్న తీరు

పెరవలి: లక్షలాది మంది ప్రజలకు తాగు, వేలాది ఎకరాలకు సాగునీరు అందించే ప్రధాన కాలువల గట్లు డంపింగ్ యార్డులను తలపిస్తున్నాయి. కాలువలను ఆనుకుని ఉండే గ్రామాల వద్ద వ్యర్థాలను తీసుకొచ్చి కాలువ గట్లపై వేస్తున్నారు. ఫలితంగా స్వచ్ఛమైన జలాలు కలుషితం కావడంతో వాటిని వినియోగించే రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని ప్రధాన పంట కాలువలైన కాకరపర్రు కెనాల్, బ్యాంక్ కెనాల్, నక్కల కాలువ, నిడదవోలు-నరసాపురం కాలువలు ఇందుకు ఉదాహరణలు. ఈ కాలువ గట్లపై వేసిన వ్యర్థాల వల్ల పరిశుభ్రమైన జలాలు దిగువ ప్రాంతాల వారికి అందడం లేదు. కాకరపర్రు కెనాల్ గట్లపై ఉసులుమర్రు, తీపర్రు గ్రామాల వద్ద వ్యర్థాలు వేస్తున్నారు. అలాగే నరసాపురం కెనాల్‌పై పెరవలి, కాపవరం గ్రామాల్లోను, నక్కల కాలువపై ముక్కామల, నల్లాకులవారిపాలెం, ఖండవల్లి గ్రామాల వద్ద చెత్తా చెదారం వేస్తున్నారు. ఇక బ్యాంక్ కెనాల్ గట్లపై కాకరపర్రు, మల్లేశ్వరం గ్రామాల వద్ద వ్యర్థాలు వేయడంతో రైతులు, అధికారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పదేళ్ల క్రితం ఈ కాలువల్లో పడవలను నడిపే వారు. కాలక్రమేణా జల రవాణా అంతరించిపోయింది. ఇదే అదనుగా రైతులు గట్లను కొద్దికొద్దిగా తొలచి తమ పొలాల్లో కలిపేసుకుంటున్నారు. మరోవైపు గ్రామ పంచాయతీలు గ్రామాల్లో సేకరించిన వ్యర్థాలను తీసుకువచ్చి కాలువ గట్టుపై వేస్తున్నారు. దీంతో గోదావరి జలాలు కలుషితం కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఏయే కాలువ ఎంతెంత దూరం

నరసాపురం కాలువ పెరవలి మండలంలో ఆరు కిలోమీటర్లు మాత్రమే ప్రయాణిస్తుంది. శివారున ఉన్న మొగల్తూరు చేరుకునేందుకు 50 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తుంది. బ్యాంక్ కెనాల్ మండలంలో 15 కిలోమీటర్లు ప్రయాణిస్తుంది. దిగువన ఉన్న లక్ష్మీపురం వరకూ సుమారు 40 కిలోమీటర్లు ప్రవహిస్తుంది. కాకరపర్రు కెనాల్ మండలంలో 13 కిలోమీటర్ల పొడవునా పారుతుంది. దిగువన నరసాపురం చేరుకునేందుకు 53 కిలోమీటర్లు ప్రవహిస్తుంది. ఇక నక్కల కాలువ మండలంలో 15 కిలోమీటర్లు దూరం మాత్రమే ప్రవహిస్తున్నా, చివరి గమ్యస్థానం నరసాపురం చేరుకునేందుకు 45 కిలోమీటర్లు ప్రయాణిస్తుంది.



పంచాయతీలకు పెరవలి ఇరిగేషన్ ఏఈ ఇచ్చిన నోటీసు

అధికారుల నిర్లక్ష్యం

కాలువ గట్లు డంపింగ్ యార్డులుగా మారిపోవడానికి అధికారుల నిర్లక్ష్యం కూడా కారణంగా చెప్పవచ్చు. వ్యర్థాలను మొదటిసారి కాలువ గట్లపై వేసినపుడే అధికారులు నియంత్రణ చర్యలు తీసుకుని ఉంటే నేడు ఈ పరిస్థితి వచ్చేది కాదని పలువురు అంటున్నారు. కాలువ గట్లపై చెత్తాచెదారం గుట్టల్లా పేరుకుపోవడంతో పొలాలకు రాకపోకలు సాగించటానికి తీవ్ర అవస్థలు పడాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు.

జలాలు కలుషితం

కాలువ గట్లపై వ్యర్థాలు గుట్టల్లా పెరిగినపుడల్లా ఆయా గ్రామాల వారు వాటిని తగలబెట్టి, బూడిదను కాలువల్లోకి వేస్తున్నారు. ఫలితంగా కాలువల జలాలు కలుషితం అవుతున్నాయి. అంతేగాకుండా గేదెల కళేబరాలను, మేకలను కోసినపుడు వచ్చే వ్యర్థాలను కూడా ఈ కాలువల్లోనే వేస్తున్నారు.ఈ విధంగా కూడా నీరు కలుషితమై, ఆ నీటిని తాగిన దిగువ ప్రాంత ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. డెల్టాలో తాగునీటికి ఇబ్బందులు లేకపోయినా శివారు మొగల్తూరు, నరసాపురం, ఆచంట వంటి మండలాల ప్రజలు ఈ కాలువల నీటినే తాగునీటిగా వినియోగిస్తున్నారు. అందుచేత ఈ కాలువల జలాలు కలుషితం కాకుండా చూడాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉంది.

పంచాయతీలకు నోటీసులు



"కాలువ గట్లపై చెత్త చెదారం వేస్తున్న పంచాయతీలకు నోటీసులు జారీ చేశాం. గట్లపై వేసిన వ్యర్థాలను తొలగించి, ఇకపై వేయకుండా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామ పంచాయతీలకు జారీ చేసిన నోటీసుల్లో స్పష్టం చేశాం."

ఎస్.బాలమురళీకృష్ణ, ఇరిగేషన్ ఏఈ, పెరవలి

రేపు పెరవలి మండల సమావేశం

పెరవలి: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం ఉదయం 10 గంటలకు జరుగుతుందని ఎంపీడీఓ సీహెచ్ వెంకటరమణ శనివారం తెలిపారు. ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, మండలస్థాయి అధికారులు హాజరు కావాలని కోరారు.

టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్

తాళ్లపూడి: పెద్దేవం గ్రామంలోని జీఎస్ రావు జెడ్పీ హైస్కూల్ టెన్త్ విద్యార్థులకు మోడల్ పేపర్స్‌తో కూడిన స్టడీ మెటీరియల్ అందజేశారు. ఏఎస్‌వో జె.వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయురాలు రమాదేవి దంపతులు 45 మంది విద్యార్థులకు శనివారం వాటిని అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ నాగేంద్రరావు, ఉపాధ్యాయులు జోడాల రమాదేవి, శాంతికుమారి, జామి సత్యనారాయణ, మధుకుమార్, రాజేష్, శ్రీనివాస్, మధులత పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి 'తలారి' సంతాపం

తాళ్లపూడి: పెద్దేవం గ్రామానికి చెందిన తిగిరిపల్లి జయబాబు ఇటీవల మృతి చెందారు. ఆ గ్రామంలో శనివారం నిర్వహించిన జయబాబు సంస్మరణ సభలో వైఎస్సార్ సీపీ కొవ్వూరు కో-ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, ఆ పార్టీ మండల నాయకులు పాల్గొని నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు తోట రామకృష్ణ, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి పిట్టా శ్రీనివాస్, నాయకులు యాళ్ల బాబురావు, నామా ప్రకాశం, సిర్రా గంగారావు, కొయ్యే దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

సాదాసీదాగా కొవ్వూరు మున్సిపల్ సమావేశం



కొవ్వూరు మున్సిపల్ సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ బావన రత్నకుమారి

కొవ్వూరు: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం సాదాసీదాగా జరిగింది. చైర్‌పర్సన్ బావన రత్నకుమారి అధ్యక్షతన శనివారం కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఐదో వార్డు కౌన్సిలర్ మద్దిపట్ల సాయిగీత మాట్లాడుతూ తన వార్డులో చిన్న చిన్న పనులు చేపట్టడానికి సాధారణ నిధులు లేవని చెబుతున్నారు. విద్యుత్ లైటింగ్ పెండింగ్ బకాయిలు రూ.19 లక్షలను మున్సిపల్ సాధారణ నిధుల నుంచి ఎలా చెల్లిస్తారని ప్రశ్నించారు. ఈ అంశాన్ని వాయిదా వేయాలని కోరారు. కమిషనర్ టి.నాగేంద్రకుమార్ మాట్లాడుతూ లైటింగ్, పారిశుధ్యం, తాగునీరు సరఫరా వంటి పనులకు సాధారణ నిధుల నుంచే చెల్లింపులు చేయాల్సి ఉందన్నారు. దీనిలో చర్చ అనంతరం సమావేశంలో ఆ అంశాన్ని ఆమోదించారు. వైస్ చైర్‌పర్సన్ మన్నె పద్మ మాట్లాడుతూ వార్డుల్లో చేపట్టే పనుల గురించి ఆయా వార్డు కౌన్సిలర్లకు కచ్చితంగా సమాచారం అందించాలని సూచించారు. వార్డుల్లో ఏ పనులు కేటాయిస్తున్నారో స్థానిక కౌన్సిలర్లకు తెలియడం లేదన్నారు. ఏ పని చేపట్టినా కౌన్సిలర్ల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు.అజెండాలో పేర్కొన్న 42 అంశాల్లో 18వ అంశాన్ని వాయిదా వేశారు.మిగిలిన 41 అంశాలకూ కౌన్సిల్ ఆమోదం తెలిపింది.

వాడీవేడిగా నిడదవోలు మున్సిపల్ సమావేశం

- టీడీపీ, వైఎస్సార్ సీపీ సభ్యుల మధ్య వాగ్వాదం
- అజెండాలోని 8 అంశాల వాయిదా
- హాజరైన మంత్రి కందుల దుర్గేష్



కౌన్సిల్ సమావేశంలో సభ్యుల మధ్య వాగ్వాదం

నిడదవోలు: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ, అత్యవసర సమావేశాలు శనివారం వాడీవేడిగా జరిగాయి. సమావేశాలకు చైర్మన్ భూపతి ఆదినారాయణ అధ్యక్షత వహించారు. వివిధ ప్రజా సమస్యలపై వైఎస్సార్ సీపీ సభ్యులు మాట్లాడుతున్నపుడు టీడీపీ కౌన్సిలర్ కారింకి నాగేశ్వరరావు తరచూ అడ్డుపడడంతో సమావేశం రసాభాసగా మారింది. ఒకానొక దశలో వైఎస్సార్ సీపీ సభ్యులు పువ్వల రతీదేవి, కారింకి నాగేశ్వరరావు మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఎక్స్ అఫీషియో సభ్యుడిగా హాజరైన రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఇరువర్గాలను సముదాయించే ప్రయత్నం చేశారు. రెండు సమావేశాల్లో అజెండాలోని 8 అంశాలు వాయిదా వేశారు.

మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి మరిన్ని నిధులు తీసుకువచ్చి పార్టీలకతీతంగా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. రానున్న పుష్కరాల అభివృద్ధి పనుల్లో రాజమహేంద్రవరం, కొవ్వూరులతో పాటు నిడదవోలును కూడా చేర్చామన్నారు. పర్యాటక రంగాభివృద్ధిలో భాగంగా ఎకో, టెంపుల్ టూరిజం అభివృద్ధికి రూ.170 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామన్నారు. దీనిలో గోదావరి పరీవాహక ప్రాంతాల అభివృద్ధికి రూ.90 కోట్లు కేటాయించామన్నారు. టెంపుల్ టూరిజంలో భాగంగా కోటసత్తెమ్మ వారి ఆలయాన్ని మరింతగా అభివృద్ధి చేస్తామన్నారు. మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ మాట్లాడుతూ పుష్కర నిధులు రూ.170 కోట్లతో పట్టణాభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు.

గుంతల పూడ్చివేతకు సాధారణ నిధులా?

పట్టణంలోని సీసీ, బీటీ రోడ్లపై గుంతలు పూడ్చడానికి మున్సిపల్ సాధారణ నిధులు రూ.45 లక్షలు కేటాయించడంపై కౌన్సిలర్ రతీదేవి అభ్యంతరం తెలిపారు. ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులను ఈ పనులకు కేటాయించాలన్నారు. ప్రతి అజెండాలో రోడ్ల మరమ్మతులు అంటూ రూ.5 లక్షలు కేటాయిస్తున్నట్టు గత కౌన్సిల్‌కు తీసుకువచ్చారని ఆమె అన్నారు. అసలు ఎంత మేరకు ఖర్చు చేస్తున్నారో చెప్పాలని పట్టుబట్టారు. మున్సిపల్ డీఈఈ సత్యనారాయణ సమాధానం ఇస్తూ మొత్తం రూ.47 లక్షలు కేటాయించామన్నారు. అగ్రిమెంట్ ప్రకారం వీధి దీపాల నిర్వహణకు రూ.17.50 లక్షలు చెల్లించడానికి వీల్లేదని రతీదేవి అభ్యంతరం తెలిపారు. ఏడేళ్లుగా వీధి దీపాలు నిర్వహణ అధ్వానంగా ఉందన్నారు. దీనిపై కమిషనర్ కృష్ణవేణి సమాధానం ఇస్తూ వీధి దీపాల నిర్వహణ సరిగ్గా లేనందున రూ.12 లక్షల పెనాల్టీ, టీడీఎస్ కింద రూ.4.7లక్షలు మినహాయించి మిగిలిన సొమ్ము చెల్లించాలన్నారు. ఆర్వోబీ మూడో ఆర్మ్ ప్రాంతంలో తొలగించిన ఇంటి నిర్మాణాల్లో కొన్ని కోర్టు కేసుల్లో ఉన్నాయని, వాటిని పరిశీలించి రైటాఫ్ చేయాలని కౌన్సిలర్ ఎస్కే వజీరుద్దీన్ కోరారు. వైస్ చైర్మన్ యలగాడ బాలరాజు, కౌన్సిలర్లు కామిశెట్టి సత్యనారాయణ, గోపిరెడ్డి శ్రీనివాస్ చర్చల్లో పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా అభివృద్ధికి పాటుపడాలి

- ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్
- ఉండ్రాజవరం మండల పరిషత్ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్

ఉండ్రాజవరం: పార్టీలకు అతీతంగా మండలం అభివృద్ధికి పాటుపడాలని ఎంపీటీసీ సభ్యులకు, సర్పంచులకు ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ సూచించారు. ఉండ్రాజవరం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి అధ్యక్షతన జరిగింది. ఎమ్మెల్సీ వంకా మాట్లాడుతూ గ్రామాల్లోని సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. గత మండల సమావేశంలో ప్రజాప్రతినిధులు లేవనెత్తిన సమస్యలను మినిట్స్ బుక్‌లో రాయాలని అధికారులకు సూచించానని, కాని పాటించడం లేదన్నారు. మండల పరిషత్ సమావేశాలకు సగానికి పైగా సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు హాజరు కాకపోవడంతో గ్రామాల్లోని సమస్యలు అధికారుల దృష్టికి రావడం లేదన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భవానీ మాట్లాడుతూ జలజీవన్ మిషన్ పనుల్లో భాగంగా గ్రామాల్లో పైపులైన్, ట్యాంకుల నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. అనంతరం ఆయా శాఖల మండల అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ముందుగా మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చిత్ర పటానికి జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కరరామయ్యతో పాటు ప్రజాప్రతినిధులు పూలమాలలు వేశారు. అనంతరం రెండు నిముషాల పాటు మౌనం పాటించారు. సమావేశంలో మండల ప్రత్యేకాధికారి మల్లు సందీప్, ఎంపీడీవో వి.రామారావు, పెరవలి డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ బూరుగుపల్లి శ్రీనివాసు, వైస్ ఎంపీపీ నరహరిశెట్టి సరోజ, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

క్రీస్తు చూపిన మార్గం ఆనందమయం



పెద్దేవం క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న తలారి, డాక్టర్ గూడూరి శ్రీనివాస్ తదితరులు



సింగరాజుపాలెం మహిమా ఆలయం క్రిస్మస్ వేడుకల్లో మాజీ మంత్రి తానేటి వనిత, మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

తాళ్లపూడి: ఏసుక్రీస్తు చూపిన మార్గంలో పయనిస్తే జీవితం ఆనందమయంగా సాగుతుందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ కొవ్వూరు కో-ఆర్డినేటర్ తలారి వెంకట్రావు పేర్కొన్నారు. పెద్దేవం గ్రామంలో పంచాయతీ వార్డు మెంబర్ వీరమణి ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకకు తలారి వెంకట్రావుతో పాటు, ఆ పార్టీ రాజమహేంద్రవరం పార్లమెంటరీ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ హాజరై కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారిద్దరూ మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలోనూ ప్రేమ, దయ, కరుణ ఉండాలని చెప్పిన మహనీయుడైన ఏసుక్రీస్తు పుట్టిన రోజే క్రిస్మస్ అన్నారు. నిర్వాహకులు తలారి వెంకట్రావును, డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు తోట రామకృష్ణ, జెడ్పీ వైస్ చైర్ పర్సన్ పోశిన శ్రీలేఖ, పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి పిట్టా శ్రీనివాస్, సర్పంచ్ తిగిరిపల్లి వెంకట్రావు, సంఘ సభ్యులు, నాయకులు మైలవరపు రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఏసుక్రీస్తు జననం .. మానవాళికి పర్వదినం

నల్లజర్ల: ఏసుక్రీస్తు జననం మానవాళికి పర్వదినమని మాజీ మంత్రి తానేటి వనిత అన్నారు. మండలంలోని సింగరాజుపాలెంలో బైబిల్ మిషన్ ఆధ్వర్యంలో దైవదర్శన మహిమా ఆలయంలో పాముల నర్సింహం ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. వనిత ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చిన్నారుల గీతాలాపనలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్‌గా ఎంపికైన వెల్లంకి వెంకట సుబ్రహ్మణ్యాన్ని ఈ సందర్భంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసు, ఎంపీటీసీ వామిశెట్టి పావనీ కుమారి, పరమేశ్వరావు, మట్టా లక్ష్మి, పాస్టర్స్ రాజు, పాలకోడేరుకు చెందిన సుజనారావు తదితరులు పాల్గొన్నారు.

కాలనీల్లో మౌలిక సదుపాయాలకు చర్యలు

- కలెక్టర్ ప్రశాంతి
- కొవ్వూరు జగనన్న కాలనీ సందర్శన



కొవ్వూరు జగనన్న కాలనీలో మౌలిక సదుపాయాలపై ఆరా తీస్తున్న కలెక్టర్ ప్రశాంతి

కొవ్వూరు: ప్రభుత్వ లేఅవుట్ల కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. పట్టణ శివార్లలోని జగనన్న కాలనీలో మౌలిక సదుపాయాలను శనివారం ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ లబ్ధిదారులను ఆదేశించారు. గృహ నిర్మాణాలకు ప్రభుత్వం ఇచ్చే ఆర్థిక చేయూతతో పాటు స్వయం సహాయక సంఘాల మహిళలకు అదనపు రుణ సౌకర్యం కల్పిస్తామన్నారు. ఈ మేరకు బ్యాంకర్లతో మాట్లాడామన్నారు. ప్రభుత్వ లే అవుట్లలో తాగునీటి వసతి, రహదారులు, పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని మునిసిపల్ కమిషనర్‌ను ఆమె ఆదేశించారు. కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత, హౌసింగ్ ఇన్‌చార్జ్ పీడీ కేఆర్ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్.భాస్కర్ రెడ్డి, తహసీల్దార్ ఎం.దుర్గా ప్రసాద్, విద్యుత్ శాఖ ఏడీ డి.జగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కురుకూరు సదస్సుకు అర్జీల వెల్లువ

దేవరపల్లి: మండలంలోని కురుకూరులో శనివారం రెవెన్యూ గ్రామ సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ కె.రాజ్యలక్ష్మి తొలుత గ్రామంలో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం గ్రామ సచివాలయం వద్ద గ్రామసభ నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. తహసీల్దార్ మాట్లాడుతూ సదస్సులో 143 అర్జీలు ప్రజల నుంచి స్వీకరించినట్టు తెలిపారు. ఎక్కువగా భూముల విస్తీర్ణంలో తేడాల గురించి అర్జీలు వచ్చినట్టు చెప్పారు. వాటిలో 131 రీసర్వే సమస్యలు, రెండు సబ్ డివిజన్, ఇతర సమ్యలపై 10 అర్జీలు వచ్చినట్టు వివరించారు. ఈ సదస్సుకు సర్పంచ్ కొయ్యలమూడి అనంతలక్ష్మి అధ్యక్షత వహించగా, వీర్వోలు, రెవెన్యూ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

నందిగంపాడులో 14 ఫిర్యాదులు

చాగల్లు: తహసీల్దార్ ఎం.మేరికమ్మ ఆధ్వర్యంలో మండలంలోని నందిగంపాడు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద రెవెన్యూ గ్రామ సదస్సు నిర్వహించారు. గ్రామ రెవెన్యూ పరిధిలోని భూ సమస్యలను ఈ సందర్భంగా ఆమె రైతులను అడిగి తెలుసుకున్నారు. గ్రామ సదస్సులో 14 ఫిర్యాదులు వచ్చినట్టు తెలిపారు. ఇందులో భూ రీసర్వే కోసం ఆరు, పాస్‌బుక్‌ల కోసం నాలుగు, మీ సేవ ఫిర్యాదులు నాలుగు వచ్చినట్టు వివరించారు. శనివారంతో మండలంలో రెవెన్యూ సదస్సులు ముగిసినట్టు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కుడప రాంబాబు, డిప్యూటీ తహసీల్దార్ టి.శ్రీనివాస్, ఆర్ఐ కమల్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు

కాపవరంలో ఐదు..

పెరవలి: మండలంలోని కాపవరంలో తహసీల్దార్ డి.అచ్యుతకుమారి ఆధ్వర్యంలో రెవెన్యూ గ్రామ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ఐదు ఫిర్యాదులు వచ్చాయి. వాటిలో మూడు రెవెన్యూ శాఖకు సంబంధించినది కాగా, ఒకటి డంపింగ్ యార్డుకు చెత్త రిక్షా కాకుండా ఆటో ఏర్పాటు చేయాలని. సదస్సులో డిప్యూటీ తహసీల్దార్ సన్నిబాబు, ఆర్ఐ పావని, సర్పంచ్ బంటుమిల్లి రత్నాజీరావు, గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

తాళ్లపూడిలో మెగా వైద్య శిబిరం



తాళ్లపూడి వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యురాలు

తాళ్లపూడి: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ మండల శాఖ ఆధ్వర్యంలో శనివారం తాళ్లపూడిలోని సొలస దమయంతి సత్యనారాయణ ఆర్యవైశ్య కల్యాణ మండపంలో మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఆ సేవాసంస్థ చైర్మన్ సింహాద్రి జనార్దనరావు ప్రారంభించారు. రాజానగరంలోని జీఎస్ఎల్ ట్రస్ట్ హాస్పిటల్‌కు చెందిన 25 మంది డాక్టర్ల బృందం రోగులకు పరీక్షలు నిర్వహించారు. అవసరమైన రోగులకు ఉచితంగా మందులు అందజేశారు. రెండు సంచార వాహనాల్లో క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు, స్త్రీలకు గర్భాశయ, రొమ్ము పరీక్షలు చేశారు. అలాగే స్త్రీ, పురుషులకు ఊపిరితిత్తుల ఎక్స్ రే, ఉదర,గుండె పరీక్షలు నిర్వహించారు. చర్మ, కిడ్నీ, మూత్రకోశ వ్యాధులకు, చెవి, ముక్కు, గొంతు, కంటి, నరాలు, ఎముకలు, కీళ్లు, దంత వంటి పరీక్షలు చేశారు. శిబిరంలో మొత్తం 550 మందికి వైద్య పరీక్షలు చేశారు. మానవత సంస్థ మందులు అందజేసింది. కార్యక్రమంలో మానవత సంస్థ మండలశాఖ అధ్యక్షుడు అంకెం సురేష్, సభ్యులు సనపల రాజశేఖర్, అప్పన వీరహనుమంతరావు, పెమ్మాడి దుర్గాప్రసాద్, గోకవరపు బాబులు, సూరిబాబు, తుంపూడి నాగభూషణగుప్తా, గంధం మునేశ్వరరావు, నక్కా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.